క్లుప్తంగా

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు



వైద్యపరీక్షలు చేస్తున్న జానకిరావు

పులిచెర్ల(కల్లూరు): గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డా.జానకి రావు తెలిపారు. కల్లూరు విరూపాక్షమ్మ గుడి వీధిలో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించి రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. నడవ లేని రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందిస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజరు శారద, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతిధులు

బైరెడ్డిపల్లె: మండలంలోని చప్పిడిపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత రాజగోపాల్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ కేశవులు, వైస్ ఎంపీపీ రూప పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఆయన సేవలను కొనియాడారు.

ఆలయ నిర్మాణానికి రూ.30 వేలు వితరణ



విరాళం అందజేస్తున్న దాత గౌరీశ్వరమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని దేవదొడ్డిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బైరెడ్డిపల్లెకి చెందిన గౌరీశ్వరమ్మ బుధవారం రూ.30 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ నిర్మాణపనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేసి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కలిగిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చక్రవర్తి, కార్తికేయన్, పళనిగౌండర్, కోటయ్య, ధనంజయ, బాబు, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

అంధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పలమనేరు యువకులు

పలమనేరు: పట్టణానికి చెందిన పలువురు దాతలు కలసి జాతీయ అంధుల సమాఖ్య తిరుపతిలో నిర్వహిస్తున్న అంధుల పాఠశాలలోని 250 మంది పిల్లలకు లూయిస్ బ్రెయిలీ 214 జయంతి సందర్భంగా బుధవారం అన్నదానం చేపట్టారు. అంధపిల్లలకు తమ ద్వారా ఇలాంటి సేవ చేసే అవకాశాన్ని కల్పించిన అక్కడి అధికారులకు దాతలు ధన్యవాదాలను తెలిపారు. దాతలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. జీలుబాయ్, కుమార్‌రాజా, సలాంనౌషాద్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

బోరు మోటారు ఏర్పాటు

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లె పంచాయతీ పరిధిలోని సత్రం ఇళ్ల వద్ద బుధవారం తాగునీటి బోరుకు నూతన మోటారు, స్టార్టర్ అమర్చినట్టు సర్పంచ్ మురళీరెడ్డి తెలిపారు. తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ముళ్ల పొదల తొలగింపు

సదుం: మండలంలోని సదుం-నాయనపాకాల మార్గంలో నడిగడ్డ సమీపంలోని రఘుపతి చెరువు కట్టపై ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను తెలుసుకున్న సర్పంచ్ నారాయణరెడ్డి బుధవారం చెట్లను కొట్టి వేయించి పరిసరాలను శుభ్రం చేయించారు.

ఎమ్మెల్యే పర్యటన రేపు

పలమనేరు: వైఎస్సార్ పింఛను వారోత్సవాల్లో భాగంగా ఈనెల 6న పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరు కానున్నట్టు మండల కన్వీనర్ బాలాజీ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెరిగిన పింఛన్లు, కొత్త పింఛన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు జెడ్పీ బంగ్లాలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు జింకా చలపతి హాజరు కావాలన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు పెరిగిన రూ.2,750 కానుకను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పింఛన్‌దారులు, నాయకులు, కన్వీనర్లు హాజరు కావాలన్నారు.

ప్రజల ఆత్మీయతను ఆస్వాదిస్తూ..

- వడివడిగా సాగిన మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాట
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం..



ప్రజలకు అభివాదం చేస్తూ పర్యటిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల(పుంగనూరు): మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట పర్యటన 81 చిన్న ఉప్పరపల్లె గ్రామం నుంచి బుధవారం ప్రారంభమైంది. నంజంపేట, పొదలకుంటపల్లె, ఎస్.నడింపల్లె, సోమల పంచాయతీల పరిధిలోని 41 గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రతి గ్రామంలో మహిళలు, అభిమానులు, నాయకులు మంగళహారతులు, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. వారిని పేరుపేరునా పలకరిస్తూ మంత్రి పర్యటన కొనసాగింది. ఆత్మీయ పలకరింపులు, కుశల ప్రశ్నలతో ప్రజలతో ఆయన మమేకమయ్యారు. నవరంవారిపల్లె, 81 చిన్న ఉప్పరపల్లెలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ఆయన ప్రారంభించారు. నంజంపేట, పొదలకుంటపల్లెలో నూతన ఆర్వో ప్లాంట్లకు ప్రారంభోత్సవం చేశారు. శీలంవారిపల్లె, ఎస్.నడింపల్లెలో ఆర్బీకేలను ప్రారంభించారు. దిడ్డివారిపల్లెలో ఆర్వో ప్లాంటు, సచివాలయ భవనం, ఆర్‌బీకే భవనం, సమావేశ మందిరానికి ప్రారంభోత్సవం చేశారు. పర్యటనలో భాగంగా పలువురు ఆయన దృష్టికి స్థానికంగా నెలకొన్న సమస్యలను తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నూతనంగా మంజూరు అయిన పింఛన్లు పంపిణీ చేశారు. నంజంపేటలో నూతనంగా నియమించబడిన ఐదుగురు ఎలిఫెంట్ ట్రాకర్లకు మంత్రి యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, అమాస మోహన్, నాగేశ్వరరావు, గంగాధర రాయల్, వైస్ ఎంపీపీ ప్రభాకర, సయ్యద్‌బాషా, సర్పంచ్‌లు రాజేశ్వరి, సిద్దులమ్మ, వెంకటరెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు సరస్వతి, నాగభూషణంరెడ్డి, మహమ్మద్ అలీ జిన్నా, సావిత్రమ్మ, నాయకులు పాల్గొన్నారు.

నేటి పర్యటన..

మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పేటూరు, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె పంచాయతీల పరిధిలోని 48 గ్రామాల్లో మంత్రి పల్లెబాట నిర్వహించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేయనున్నారు.

దేశంలోనే ఆదర్శవంతమైన పాలన

- అర్హత ఉంటే చాలు పథకాలు అందిస్తాం
- ఎమ్మెల్యే వెంకటేగౌడ



సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం వి.కోట పంచాయతీలోని గంగమ్మగుడి వీధి, బంగ్లాచేను, నారాయణనగర్, కుప్పం రోడ్డు, వినాయకనగర్ 4 క్రాస్‌లలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి 436 గృహాలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభ్యున్నతే ధ్యేయంగా వారి పేరుపైనే వైఎస్సార్ చేయూత, ఇంటి పట్టాలు, వైస్సార్ ఆసరా, అమ్మఒడి పథకాలను అందజేయడంతో పాటు వారి ఖాతాల్లో నేరుగా ప్రభుత్వమే నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమ పథకాల అమలుపై దృష్టి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులే లబ్ధిదారులను వెతుక్కుంటూ వెళ్లి పథకాలను అందిస్తున్నారని తెలిపారు. అన్ని అర్హతలు కలిగి ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురా వాలని సూచించారు. వలంటీర్ వ్యవస్థతో పారదర్శకంగా పథకాలు అందుతున్నాయన్నారు.

పరిష్కారం అవుతున్న సమస్యలు

గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యలు సైతం జగనన్న పాలనలో పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. మూడేళ్ల పాలనలో 2 లక్షల కోట్ల నిధులను ప్రజల ఖాతాల్లోకి నేరుగా జ మ చేసిన చరిత్ర జగనన్నకే దక్కుతుందన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు వెలకట్టలేనివి..

లయన్స్‌క్లబ్ వారు పేద ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే వెంకటేగౌడ కొనియాడారు. బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ అతిథిగృహంలో పేదలకు, అభాగ్యులకు 300 దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, సర్పంచ్ పీఎస్ లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ ధవనంభక్త, గోపిరెడ్డి, నాయకులు ఆంజనేయులు, మణి, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూపురేఖలు మారనున్న బోయకొండ రోడ్డు

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి



భవానీ నగర్ వద్ద మొక్కలు నాటే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు రూపురేఖలు మారనున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆయన మంత్రి పీఏ మునితుకారంతో కలిసి బోయకొండ భవానీ నగర్ నుంచి బోయకొండ రణబేరి గంగమ్మ ఆలయం వద్దకు మొక్కలు నాటే ప్రదేశాలను పరిశీలించారు. పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి సూచనలతో నాలుగులేన్ల రహదారిలో పెంచాల్సిన మొక్కల రకాలపై చర్చించారు. రోడ్డుకు ఇరువైపులా, రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు పెంపడంతో పాటు విద్యుత్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుమారు 5 కిలోమీటర్ల మేర రోడ్డును అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి రాజమండ్రి కడియం నర్సరీ నుంచి మొక్కలు తెస్తున్నట్లు పెద్దిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ, మల్లికార్జునరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి వసుంధర, నేతలు రఘుపతినాయుడు, గంగిరెడ్డి, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్పీ ఆవిర్భావ దినోత్సవం

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నేత వెంకటేశు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఎస్పీ అలుపెరుగని పోరాటం కొనసాగిస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గోవిందప్ప, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఉదయ్, వెంకటస్వామి, రవీంద్ర, నవీన్, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ హేమంత్ కుమార్

వి.కోట: మండలంలోని శివునికుప్పం వద్ద నూతనంగా నిర్మిస్తున్న మినీ మార్కెట్ యార్డును పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మామిడి కాయల సీజన్ సమయానికి రైతులకు మార్కెట్ యార్డును నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పుష్పాంజనేయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పుంగనూరు ఫస్ట్



పుంగనూరు: ప్రసంగిస్తున్న నాగభూషణం, పక్కన మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల సమస్యలను ఇళ్ల వద్దనే పరిష్కరించడంలో జిల్లాలోనే పుంగనూరు మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ముతో కలసి 2వ సచివాలయంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లను పెంచారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు 157 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, కౌన్సిలర్లు నరసింహులు, మమత, జయభారతి, కమలమ్మ, సాజిదాబేగం, కాళిదాసు, జేపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

సదుం: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలకు బ్రెయిలీ జీవన నైపుణ్యాలను వివరించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో మురుగునీటి కాలువ పనులు



కాలువ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రూ.30 లక్షలతో మురుగునీటి కాలువను నిర్మిస్తున్నట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మురుగునీటి కాలువ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం కురిసిన వర్షాలకు నీరు తహసీల్దార్ కార్యాలయంలోకి చేరిందని, దీంతో బీసీ హాస్టల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం వరకు మురుగునీటి కాలువతో పాటు, రెండు కల్వర్టులను నిర్మించేందుకు ప్రతి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. వీటికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.30 లక్షలు జెడ్పీ నిధులను మంజూరు చేయించడంతో పనులను ప్రారంభించామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురాషావలి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, డీటీ వెంకటరమణారెడ్డి, సర్వేయర్ సులోచన, కార్యదర్శి హరిబాబు, నాయకులు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



జ్వరాలపై సమీక్షిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి

సదుం: మండలంలో జ్వరపీడితులు పెరుగుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. జ్వర ప్రభావంపై సీహెచ్‌సీ డాక్టరు శ్రీధర్‌బాబుతో సమీక్షించారు. బాధితులకు స్వయంగా ఫోన్ చేసి వారి ఆరోగ్యంపై వాకబు చేశారు. ట్యాంకులను శుభ్రం చేయాలని ఎంపీడీఓ వరప్రసాద్, ఈఓ హసీనను ఆదేశించారు. అలాగే సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆర్‌డబ్ల్యూస్ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ పీహెచ్‌సీ పనుల పరిశీలన



కొలమాసనపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు

పలమనేరు: పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డా.శ్రీనివాసరావు సంబంధిత ఆస్పత్రుల వైద్యులకు సూచించారు. పట్టణంలో నిర్మిస్తున్న కాకాతోపు, పాతపేట భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు సచివాలయాన్ని తనిఖీ చేసి ఆ ప్రాంతంలో టీకాల కార్యక్రమంపై ఆరాతీశారు. మండంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున రెడ్డి, మాధవి, విజయ్, అనూకి, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జైశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే సీఎం జగనన్న లక్ష్యం



శాంతిపురం: సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనుక్షణం తపిస్తున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. శివరామపురం, కొలమడుగు, అబకలదొడ్డి, గుంజార్లపల్లి పంచాయతీల్లో బుధవారం మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ సీఎం జగనన్న ముందుకుపోతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్లను క్రమంగా పెంచుతూ ఈ జనవరి నుంచి రూ.2,750 ఇస్తున్నారన్నారు. పేదల ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సంక్షేమ పథకాలకు విరుద్ధంగా రాష్ట్రంలో విపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నాయకులు కోదండరెడ్డి, మునిరత్నంగౌడు, చక్రపాణిరెడ్డి, జయప్ప, బుల్లెట్ దండపాణి, పట్టాభి, సరస్వతి, విజయకుమార్, మురుగేష్, భాస్కర్‌రెడ్డి, మంజునాథ్, చంగమరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్



పుంగనూరు: అమ్మిగానిపల్లెలో సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఈఈ విజయన్

- 27 సబ్‌స్టేషన్లు మంజూరు చేయించిన మంత్రి పెద్దిరెడ్డి
- వాటి నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయింపు
- పనులను ప్రారంభించిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు

పుంగనూరు: పడమటి నియోజకవర్గం పుంగనూరులో విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 27 సబ్‌స్టేషన్లను, సుమారు రూ.500 కోట్ల నిధులను మంజూరు చేశారు. మండలంలోని అమ్మిగానిపల్లెలో 33 కేవీ సబ్‌స్టేషన్ పనులను ఈఈ విజయన్, డీఈ రవి, కాంట్రాక్టర్ రవిశంకర్‌రెడ్డితో కలసి ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గానికి మంత్రి పెద్దిరెడ్డి 27 సబ్‌స్టేషన్లు మంజూరు చేశారని తెలిపారు. 33 కేవీ సబ్‌స్టేషన్లకు రూ.2 కోట్లు చొప్పున, 220 కేవీ సబ్‌స్టేషన్ ఒక్కోదానికి రూ.200 కోట్లు మంజూరు చేశారన్నారు. 123 కేవీ సబ్‌స్టేషన్లు రెండు మంజూరయ్యాయని తెలిపారు. వీటికి రూ.200 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో భాగంగా పుంగనూరు మండలానికి 6 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాని తెలిపారు. అలాగే ఆరడిగుంట ప్రాంతాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సెజ్ ప్రాంతంగా ప్రకటించారన్నారు. ఈ ప్రాంతంలో కూడా పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం కలుగకుండా 123 కేవీ సబ్‌స్టేషన్ మంజూ రు చేశారన్నారు. ఈ పనులను కూడా ప్రారంభించినట్లు ఎంపీపీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏడీ రమేష్, ఏఈలు ధనుంజయ మూర్తి, సుబ్రమణ్యం, కాంట్రాక్టర్ రవిశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ నంజుండప్ప పాల్గొన్నారు.

త్వరలోనే నీటి సమస్య పరిష్కరిస్తాం



పెద్దతాండా ప్రజల సమస్యలు వింటున్న డీఈ

రామకుప్పం: త్వరలోనే గ్రామాల్లో నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని నీటి పారుదల శాఖ డీఈ పురుషోత్తం హామీ ఇచ్చారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని పెద్దతాండా పంచాయతీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా తమ పంచాయతీల్లో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక సర్పంచ్ మోహన్ నాయక్ డీఈ పురుషోత్తంను కోరారు. పంచాయతీ పరిధిలోని తులసీనాయక్ తాండా, ఇందిరానగర్ తాండాలో ఐదు నెలలుగా తాగునీటి సమస్య ఉందని జిల్లా ఉన్నతాధికారులకు సర్పంచ్ ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు పెద్దతాండా పరిధిలోని గ్రామాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ, ఏఈ వెంకటరమణ, ఉపసర్పంచ్ కామరాజు నాయక్, నేతలు చిన్నరాజునాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

సెబ్ స్టేషన్ ప్రారంభం



స్టేషన్ ప్రారంభోత్సవంలో సెబ్ సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్లలో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను ప్రారంభించారు. పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం మండలాల పరిధిలో అక్రమ మద్యం రవాణా అరికట్టడానికి ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు సెబ్ అసిస్టెంట్ కమిషనర్ మధుమోహన్‌రావు తెలిపారు. అక్రమంగా గంజాయి, ఇసుక, మారక ద్రవ్యాలు, ఎర్రచందనం సారా రవాణా అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ రాణెమ్మ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ చంద్రశేఖర నాయుడు, సీఐ శ్రీరాములు, ఎస్ఐ మస్తాన్‌వల్లి పాల్గొన్నారు.

సమయానికి ఆదుకుంటున్న పింఛన్



యామగానిపల్లెలో పింఛన్లు అందిస్తున్న ఎంపీపీ వరలక్ష్మి



లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న నేతలు

గుడుపల్లె: అవ్వతాతలకు ఇచ్చే పింఛన్ సొమ్ము వారికి సమయానికి ఆదుకుంటోందని ఎంపీపీ వరలక్ష్మి తెలిపారు. బుధవారం గుండ్లసాగరం, కనమనపల్లె, యామగానిపల్లె, కుప్పిగానిపల్లె గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్ వారోత్సవాల్లో ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణమూర్తి, మండల కన్వీనర్ రామకృష్ణ, ఎంపీడీఓ శంకర్, నాయకులు గోపి, శ్రీనివాసులు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉంటే పింఛన్ మంజూరు

రామకుప్పం: మండలంలోని విజలాపురం,ఉన్సిగానిపల్లి, కెంచనబళ్ల, బల్ల, సింగసముద్రం పంచాయతీల పరిధిలో బుధవారం మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుబ్రమణ్యం, నేత్రావతి, విజయ్‌కుమార్, పెరితాయమ్మ, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామే గౌడు, సులోచన, చలపతి,అశ్విని, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్ అందజేత

బైరెడ్డిపల్లె: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని గొనితిమ్మేపల్లె సర్పంచ్ చంద్రిక అన్నారు. బుధవారం ఆమె కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక సచివాలయం వద్ద పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.